'ఆపరేషన్ ముస్కాన్–10'..

బాలల సంరక్షణే లక్ష్యం

- పరిశ్రమలు, బట్టీలు, దుకాణాల్లో కొనసాగుతున్న తనిఖీలు
- రంగంలో ప్రత్యేక తనిఖీ బృందాలు
- ఇప్పటి వరకు 91 మంది గుర్తింపు
- బృందాల్లో పోలీసు, కార్మిక, సంక్షేమ తదితర శాఖల అధికారులు
- నెలాఖరు వరకు తనిఖీలు



ఆపరేషన్ ముస్కాన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి కృష్ణారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: బడికెళ్లి ఆటపాటలతో చదువుకోవాల్సిన బాలలు బతుకుదెరువు కోసం పరిశ్రమల్లోకి వెళ్తున్నారు. పలకా బలపం పట్టుకోవాల్సిన చిట్టి చేతులు.. బట్టీల్లో ఇటుకలు మోస్తున్నాయి.. హోటళ్లలో పాత్రలను శుభ్రం చేస్తున్నాయి. ఆర్థిక పరిస్థితులు, కుటుంబ కారణాలేవైనా.. బాల్యం ఛిద్రమవుతోంది.. బంగారు భవితను చిదిమేస్తోంది. వీటిని గుర్తించి బాలల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ సత్ఫలితాలిస్తోంది. ఇప్పటివరకు తొమ్మిదిసార్లు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మికులుగా పనిచేస్తున్న ఎంతో మందిని బడిలో చేర్పించారు. ప్రస్తుతం 'ఆపరేషన్ ముస్కాన్–10'లో కొత్త కార్యాచరణతో ముందుకెళ్తున్నారు.

పని ప్రదేశాల్లో...

- బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే చైల్డ్ లైన్ బడీడు పిల్లలు పనులకు వెళ్లకుండా, పాఠశాలలో విద్య అభ్యసించాలని సర్కారు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా రెండు సార్లు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని పరిశ్రమలు, ఇటుకబట్టీలు, హోటళ్లు, కిరాణం, షాపింగ్ మాల్స్, పారిశ్రామిక వాడలు, వస్త్ర వ్యాపారులు తదితరులకు అవగాహన కల్పిస్తున్నా.. వారిలో మార్పు రావడంలేదు. కొందరు వారిని పనుల్లో నియమించుకుంటున్నారు. వీరిలో కొందరు తప్పిపోయిన వారు ఉంటున్నారు. వీరికి విముక్తి కల్పించేందుకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతోంది.
- ఆర్థిక ఇబ్బందుల కారణంగా బస్తీలు,పల్లెలు, తండాలు, గిరిజన ప్రాంతాలకు చెందిన వారు తమ పిల్లలను వివిధ ప్రదేశాల్లో పని చేసేందుకు నియమిస్తున్నారు.
- 18 ఏళ్లలోపు చిన్నారులతో పని చేయించడం చట్టరీత్యా నేరం. అయినా పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, ఇటుక బట్టీలు, కార్మిక వాడలు, మెకానిక్ షెడ్లు, భవన నిర్మాణ ప్రదేశాలు, హోటళ్లు, ఇతర దుకాణాల్లో వారే కనిపిస్తున్నారు. బాలకార్మికులను గుర్తించి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వ ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జులైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం పదో విడత ముస్కాన్ ఈ నెలాఖరు వరకు కొనసాగనుంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు పనిలో ఉన్న 91 మందిని గుర్తించారు. ఇందులో 22 మందిని చిల్డ్రన్స్‌హోమ్‌లో చేర్పించగా, 69 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. జిల్లాలో మొత్తంగా ఆరు ప్రత్యేక బృందాలు తనిఖీల కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.
- సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని బాలానగర్, పేట్‌బాషీర్‌బాగ్, కూకట్‌పల్లి, మేడ్చల్‌లలో 4 బృందాలు, రాచకొండ పరిధిలో మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌ల్లో 2 బృందాలు ఈ నెల 31 వరకు ఆయా ప్రాంతాల్లోని పని ప్రదేశాలు, పరిశ్రమలు, పారిశ్రామిక వాడలు, ఇటుక బట్టీలు, హోటళ్లు, దుకాణాలను తనిఖీ చేయనున్నారు. గుర్తించిన వారి వివరాలను తెలుసుకుని తల్లిదండ్రులుంటే వారికి అప్పగిస్తున్నారు. లేకపోతే బాల సంరక్షణ కేంద్రాల్లో వసతి కల్పిస్తున్నారు.

'హాట్ స్పాట్'పై ప్రత్యేక నిఘా...

బాల కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించారు. వాటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. అధికారులు గుర్తించిన ప్రాంతాల వద్ద పరిశీలన చేస్తారు. పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులకు అవగాహన కల్పిస్తారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు.

ఫిర్యాదు చేయాలంటే...

చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మీరంటున్న ప్రాంతం, సందర్భమేదైనా, ఎక్కడికైనా వెళ్లినప్పుడు ఆ సమయంలో బాల కార్మికులు కనిపిస్తే.. వారికి విముక్తి కలిగించేలా చూడాలి. వెంటనే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్: 1098కు ఫోన్ చేయాలి. తద్వారా సంబంధిత శాఖ అధికారులకు సమాచారం చేరుతుంది. వివరాలు గోప్యంగా ఉంటాయి. పోలీసు సహాయ కేంద్రం 100 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. కార్మిక, సంక్షేమ శాఖ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా బాల కార్మికులను బడుల్లో చేర్పించే వీలుంటుంది.

ప్రత్యేక బృందాలుగా విధులు...

- జిల్లా వ్యాప్తంగా ఆరు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. ఒక్కో బృందంలో ఎస్ఐ, కానిస్టేబుళ్లు, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి, సిబ్బంది, విద్యా, వైద్య, కార్మిక శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ బృందాలు ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. భిక్షాటన చేస్తున్న వారు, తప్పిపోయిన చిన్నారులు, బస్, రైల్వే స్టేషన్లు, ఇతర ప్రదేశాల్లో వీధి, అనాథ, బాలలను గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేరుస్తున్నారు. బాలకార్మికులు, బడి మానేసిన, చెత్త సేకరించే, మతి స్థిమితం లేని వారిని కూడా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు.
- అలా కుదరకపోతే వసతి గృహాల్లో సీటు ఇప్పించి పాఠశాలల్లో చేర్పించేందుకు చొరవ చూపుతున్నారు.
- బాల్య వివాహాలు అడ్డుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే విభాగాల్లో చిన్నారులను గుర్తించి సంరక్షిస్తారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులు. నిర్వాహకులపై పోలీసు, కార్మికశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తారు. అనాథ బాలల సంరక్షణలో భాగంగా సీడబ్ల్యూసీ (బాలల సంక్షేమ సమితి) ఎదుట హాజరుపరుస్తారు. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటారు.


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పటిష్టంగా అమలు చేస్తున్నాం

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు. వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి. జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ పటిష్టంగా అమలు చేస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకు పనిలో ఉన్న 91 మందిని గుర్తించాం. ఇందులో 22 మందిని చిల్డ్రన్స్ హోమ్‌లో చేర్పించగా, 69 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించాం. ఈ నెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తాం.

– కృష్ణారెడ్డి, జిల్లా మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్


ఎమ్మెల్యే గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం


దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ తేజేశ్వరరావు, తదితరులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల పాఠశాలలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ తేజేశ్వరరావు ఆసుపత్రి ఆధ్వర్యంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చాక్లెట్స్, స్వీట్స్ ఎక్కువగా తినకూడదని సూచించారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పంచశీల శ్రీనివాస్, డాక్టర్ తన్మయి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సందర్భంగా అన్నదానం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, దివంగత రవికుమార్ 14వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సీ బ్రహ్మ మాట్లాడుతూ... అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అన్నారు. రవికుమార్ జ్ఞాపకార్థం రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

కుష్టు రోగులకు మెడికల్ కిట్లు అందజేత


మందులు, నగదు అందజేస్తున్న రమేష్ తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్(ఎన్‌టీపీసీ) సహకారంతో లెప్రసీ సొసైటీ ఆధ్వర్యంలో కుష్టు రోగులకు అల్సర్ మెడికల్ కిట్లు, నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లెప్రసీ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. కుష్టు రోగులను మనలో ఒకరిగా చూడాలని కోరారు. ఎన్‌టీపీసీ సహకారంతో మెడికల్ కిట్లను పర్వత్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, ఐడీపీఎల్‌లలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు సాయం చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మణెమ్మ, సంతోష్‌రెడ్డి, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



కూకట్‌పల్లి: కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో అన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, సంజీవరావు, మేకల మైఖేల్, లక్ష్మణ్, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, సునీల్ యాదవ్, రాఘవేందర్‌రావు, విఠల్ రెడ్డి, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బాలానగర్: సంఘం కార్యాలయంలో బాలానగర్ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా అంబటి సునీల్‌కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా టి. వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా అలెక్స్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సునీల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అసోసియేషన్ సభ్యులు వినియోగించుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సభ్యుల వ్యాపార అభివృద్ధికి అసోసియేషన్ మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన కేకేబీ సంస్థను రద్దు చేస్తున్నట్లు అసోసియేషన్ నిర్ణయం తీసుకుందని సభ్యులు తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణతో కలిసి శనివారం కేపీహెచ్‌బీ డివిజన్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షిస్తేనే మానవాళి మనుగడ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, రాజేష్, రాఘవరెడ్డి, వీవీ రావు, హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ

మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరామ సంగీత పాఠశాల విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. శ్రీరామ సంగీత పాఠశాల గురువు జొన్నలగడ్డ మాధురి శిష్యులు కేశవ హరిచరణ్, స్వేచ్ఛరెడ్డి, వైష్ణవి, వందిత్య, ప్రతీక్ష్య, తరుణ్ బాలాజీ, శ్రీకృతి, లలిత, శరణ్య, లలితసౌజన్యలు పాల్గొని గోవింద గోవింద, ఎండగాని నీడగాని, శరణుశరణు, తిరుమలగిరిరాయ, ఆరగించి కూర్చున్న, తందనానాఅహి కీర్తనలు ఆలపించారు. కీబోర్డు మారుతీకిరణ్, తబలా శ్రీనివాస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

రహదారుల విస్తరణ లేక.. హైటెన్షన్

- సర్వే చేసి ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవడంతో ఇబ్బందులు
- వాహనాలకు వైర్లు తాకేలా బ్రిడ్జి నిర్మాణం


విజయనగర్‌కాలనీ నుంచి ఆల్విన్‌కాలనీ, సాయినగర్‌కు వెళ్లే హైటెన్షన్ లైన్ రహదారి


మాధవరం కాలనీకి వెళ్లే దారిలో హైటెన్షన్ లైన్‌లో నాలాపై అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జి

ఆల్విన్‌కాలనీ: హైటెన్షన్ విద్యుత్ లైన్ రోడ్లను విస్తరింపజేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైటెన్షన్ విద్యుత్ స్తంభాల క్రింద ఉన్న రహదారులను విస్తరింపజేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని మెట్రో రైలు నిర్మాణ సమయంలో నాటి ప్రభుత్వం హామీనిచ్చింది. విద్యుత్ స్తంభాల క్రింద ఉన్న రహదారులను కూకట్‌పల్లి –ముంబై జాతీయ రహదారిలోని మెట్రో రైలు ప్రధాన రహదారికి అనుసంధానంగా సర్వేలు చేపట్టి ప్రణాళికలు చేశామని సంబంధిత అధికారులు తెలిపారు. కానీ నేటి వరకు క్షేత్ర స్థాయిలో పనులు జరగకపోవటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి డివిజన్‌లలోని పలు కూడళ్ల వద్ద గంటల కొద్దీ రద్దీతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణ లోపంతో..

కూకట్‌పల్లి మాధవరం కాలనీ నుంచి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌వద్ద గల బ్రిడ్జిపై వంతెన ఏర్పాటు చేశారు. కానీ వంతెనను రోడ్డుకు సమాంతరంగా నిర్మించలేదు. దీనికి తోడు హైటెన్షన్ వైర్లు వాహనాలకు తాకేంత ఎత్తులో వేలాడుతుండటంతో భారీ వాహనాలు ఇటు వైపు నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్ వైర్లు సరిచేయకపోవటం, రాకపోకలు సాగించేలా బ్రిడ్జిని నిర్మించకపోవటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ వద్ద అడ్డుగా ఉన్న గోడలను తొలగించకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాయినగర్ నాలాపై బ్రిడ్జిని నిర్మిస్తే..

సాయినగర్ నాలాకు అడ్డుగా నిర్మించిన గోడను తొలగించి రాకపోకలు సాగించే విధంగా బ్రిడ్జిని నిర్మిస్తామని అధికారులు తెలిపారు.అది కార్యరూపం దాల్చితే ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో వాహనాల తాకిడి తగ్గే అవకాశం ఉంటుంది. ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల బ్రిడ్జి నిర్మించటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగిస్తే..

ఆల్విన్‌కాలనీ ఫేజ్1 సాయి ఫంక్షన్ హాలు వద్ద హైటెన్షన్ లైన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి. రహదారి నిర్మాణం వల్ల మొదటి ఫేజ్ బస్ స్టాప్ వద్ద ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది. కూకట్‌పల్లి, భాగ్యనగర్‌కాలనీ, హైటెక్ సిటీకి వెళ్లేందుకు సమయం ఆదా కావటంతో పాటు ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయి. అదేవిధంగా ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మ చెరువు వద్ద గల హైటెన్షన్ విద్యుత్ లైన్‌లో బఫర్ జోన్ ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులు ఎటువంటి నిర్మాణం చేపట్టలేదు. ప్రయాణికులు కొన్ని సంవత్సరాలుగా ఇదే దారిలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. చెరువు బఫర్ జోన్‌లో బ్రిడ్జిలా నిర్మించి చెరువుకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రజలకు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్వరలో రహదారుల విస్తరణ

హైటెన్షన్ విద్యుత్ లైన్ల క్రింద రహదారులను ప్రయాణికులకు త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. ఎల్లమ్మబండ, భాగ్యనగర్ కాలనీకి వెళ్లే రహదారికి ప్రతి రోజు ట్రాఫిక్ తాకిడి ఉంటుంది. ఆల్విన్ కాలనీ హైటెన్షన్ లైన్‌లో ఉన్న నాలాపై బ్రిడ్జి ఏర్పాటు చేసి విజయనగర్ కాలనీకి కలిపి ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తాం. వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ముందు ఉన్న నాలాపై బ్రిడ్జిని నిర్మించాం. హైటెన్షన్ లైన్ వైర్లను సరిచేసి త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం.

–వెంకటేష్‌గౌడ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్

అట్టహాసంగా ట్రిపుల్‌ఐటీ స్నాతకోత్సవం

600 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు.. గోల్డ్ మెడల్స్



హఫీజ్‌పేట్: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్నాతకోత్సవం అట్టహాసంగా సాగింది. గచ్చిబౌలి శాంతి సరోవర్ ప్రాంగణంలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో 23వ స్నాతకోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్, డీఎస్ఐఆర్ సెక్రెటరీ డాక్టర్ ఎన్ కలైసెల్వి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అశోక్ ఝున్‌ఝున్‌వాలా, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజేనారాయణన్‌లు విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ అందించారు.

పీహెచ్‌డీ చేయాలన్నదే లక్ష్యం



ఈసీడీలో డ్యూయల్ డిగ్రీ చేశా. ప్రస్తుతం బెంగళూరులో రూ.20 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. కానీ కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేయాలన్నదే లక్ష్యం.మా తండ్రి రిటైర్డ్ ప్రొఫెసర్ కె శ్రీనివాస్ ప్రస్తుతం కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. తల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం.

– విశ్వనాథ్, ఆల్‌రౌండర్ గోల్డ్ మెడలిస్ట్, ట్రిపుల్‌ఐటీ డ్యూయల్ డిగ్రీ

రాజకీయాల్లో రాణిస్తా



భవిష్యత్తులో రాజకీయాలలో రాణించాలన్నదే లక్ష్యం. కొన్నాళ్లు జాబ్ చేసి ఆ తర్వాత రాజకీయాల్లోకి వెళతా. ఎమ్మెల్యే అవ్వాలనే ఆలోచన ఉంది. మా నాన్న, పెదనాన్న రాజకీయాల్లో ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగుతా. హైదరాబాద్ మైక్రోసాఫ్ట్‌లో రూ.50 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది, గూగుల్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నా.

– హర్షవర్ధన్, ఆల్‌రౌండర్, ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్

నేడు శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం సమావేశం

మోతీనగర్: శ్రీ వివేకానంద నగర్ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10:30 నుంచి ప్రారంభమవుతుందని అధ్యక్షుడు రోణంకి జగన్నాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీ అధ్యక్షుడి ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలనే ఆలోచనతో ప్రజల అభిప్రాయ సేకరణ కోసం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేసి, సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు.

స్పోర్ట్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.శివసేనారెడ్డిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ శనివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాహుల్ సింగ్ చౌహాన్, భాస్కర్, గిరి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

మూసాపేట: జేఎన్‌టీయూహెచ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శనివారం బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షులు తూము నిఖిల్ కుమార్‌ను కూకట్‌పల్లి పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టును పలువురు ఖండించారు.